క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



అమ్రాబాద్: మండల కేంద్రానికి చెందిన గంజి చంద్రకళ, దేవేందర్‌ల మూడో కుమార్తె మాధురి నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటంతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ సోమవారం అమ్రాబాద్‌లో మాధురికి రూ.30,000 ఆర్థికసాయం అందజేశారు. ఉన్నత చదువులు చదివి ఈ ప్రాంతానికి సేవలందించాలని సూచించారు.

వెల్దండ: మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మౌలాన్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు రూ.2వేలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా నల్లపల్లి జంగమ్మ అనార్యోంతో మృతి చెందడంతో రూ.6 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటుదాం



కల్వకుర్తిరూరల్: అమ్మ పేరుతో మొక్కలు నాటుదామని మై భారత్ జిల్లా శాఖ స్వామి వివేకానంద బృందం అధ్యక్షుడు శివ పిలుపునిచ్చారు. సోమవారం గాంధీనగర్ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు తల్లి పేరుపై మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఓర్వలేకే విమర్శలు

అచ్చంపేట: జిల్లా కేంద్రంలో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభ విజయవంతం కావడంతో కొంత మంది మాదిగలు మాల మహానాడు నాయకులపై విమర్శలు చేస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాలలే లేరని వారికి కనివిప్పు కలిగేలా సభ జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో మాలలు హక్కుల సాధించేకునేందుకు ముందుకు సాగుతామన్నారు. వర్గీకరణ చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు.

సగర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సగర సంఘం కార్యాలయంలో సోమవారం మండలంలోని యంగంపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాలయ్య, అధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబా, కోశాధికారిగా గణేష్‌తోపాటు ప్రచార కార్యదర్శిగా పర్వతాలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు భీమయ్య, బాల్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన జశ్వంత్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్– 23 జట్టుకు ఎంపికయ్యాడు. నవంబర్ 4వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పట్టణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌గౌడ్ తెలిపారు. జశ్వంత్ ఎంపికపై క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోచ్ నవీన్, ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, కిశోర్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన కోడేటి చెన్నయ్య (52) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. 20 రోజుల కిందట చేపలు పట్టేందుకు వెళ్లి నీట మునిగాడు. సోమవారం గ్రామశివారులో చెరువులో మృతదేహం తేలియాడుతూ కన్పించింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



సహకార సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, కసిరెడ్డినారాయణరెడ్డి

తాడూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సహకార సంఘం భవనాన్ని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. పేదలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, సన్న వడ్లకు రూ.500 బోనస్, బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం హామీలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు, నూతన పెన్షన్ లబ్ధిదారుల ఎంపికతో పాటు అర్హులందరికి పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో వందలాదిమంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ విద్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. పట్టణాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేసేందుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. అంతకుముందు 54 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ ఆంజనేయులు, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ జ్యోతిపరోసియా, డీసీసీబీ సిబ్బంది, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్ల పంపిణీ

కల్వకుర్తి టౌన్: కులవృత్తులకు ప్రభుత్వం చేయూతనిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి కల్వకుర్తి, వెల్దండ మండలాలలకు చెందిన 56 మంది గౌడన్నలకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గతంలో గౌడన్నలు చెట్లపై నుంచి ప్రమాదవశాత్తు పడిన, ఏదైనా అంగవైకల్యం సంభవించినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. అబ్కారీ శాఖ అధికారులు కాటమయ్య కిట్లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీరామ్, కల్వకుర్తి సీఐ వెంకట్ రెడ్డి, ఎస్ఐలు, ఇతర అధికారులు, కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన గౌడన్నలు పాల్గొన్నారు.

భక్తిభావంతో ప్రశాంతత



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎడ్మసత్యం

కల్వకుర్తిరూరల్: భక్తిభావంతో ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం అన్నారు. సోమవారం పట్టణంలో శివ మండల దీక్ష పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివమాల ధరించి భక్తులకు 41 రోజులపాటు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వసతి కల్పిస్తునట్లు ఆయన తెలిపారు. స్వాములకు డిసెంబర్ 10వ తీదీ వరకు దాతల సహకారంతో అన్నప్రసాదం పంపిణీ చేస్తామని గురుస్వామి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిషి, రాజు, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన



వెల్దండలో కొండకత్వలో చేపపిల్లలను వదులుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వెల్దండ: ముదిరాజులు సంఘటితం అయితే హక్కులు సాధించుకోవచ్చని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్యముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెర్కూర్, కొట్ర, వెల్దండ, చౌదర్‌పల్లి, బొల్లంపల్లి, కుప్పగండ్ల గ్రామాల్లో ప్రభుత్వం సబ్సిడీలో అందించిన చేప పిల్లలను చెరువుల్లో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ముదిరాజ్ కులస్తులు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో మొత్తం 2.32 లక్షల చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి, ఏఈఓ సురేష్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు కసారపు వెంకటయ్యముదిరాజ్, బానుచందర్ ముదిరాజ్, మండల అధ్యక్షుడు మల్లేష్‌ముదిరాజ్, నాయకులు వెంకటేష్‌ముదిరాజ్, మల్లయ్య ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

తాడూరు: దళితులకు అంబేడ్కర్ అభయహస్తం ద్వారా రూ.12 లక్షల ఇవ్వాలని కోరుతూ సోమవారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించాలన్నారు. దళితుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించి ఆదుకోవాలన్నారు. దళితులపై జరుగుతున్న వివక్షతను నిర్మూలించి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారయ్య, బాలు, రాముడు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తుదారుడికి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కులవృత్తులను ఆధారం చేసుకుని జీవిస్తున్న వారికి చేయూతనివ్వాలని కోరారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు గొడుగు రాజు, శంకర్, అహ్మద్, మౌలాన, శ్రీనివాస్, నవీన్, జనార్దన్ పాల్గొన్నారు.

వేరుశనగ పంటల పరిశీలన



చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో రామచంద్రపురంలో వేరుశనగ పంటలను సోమవారం సిర్సనగండ్ల ఏఈఓ వంశీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంటలో సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు తదితరులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి, కొత్త చెర్వుతండా ప్రాథమిక పాఠశాలలను సోమవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పాఠశాలల నిర్వహణపై తగు శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రతతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని వంట ఏజెన్సీలను ఎంఈఓ ఆదేశించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను మెరుగుపర్చాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపీడీఓకు వినతి



పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు బాలస్వామి, మల్లయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్‌రూరల్: రుణమాఫీని తక్షణమే అందించాలనిని కోరుతూ సోమవారం రాష్ట్ర రైతు సంఘం సహాయ కార్యదర్శి బాలమురళి కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. వార్ల వెంకటయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధుగౌడ్, శివకృష్ణ, నాయకులు కొండన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యాపట్లలో గ్యార్వీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లలో ముస్లింలు సోమవారం గ్యార్వీ వేడుకలను నిర్వహించారు. మహబూబ్‌సుబానీ గంధోత్సవాన్ని గ్రామంలో ఊరేగించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వాహనాల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలో ఎస్ఐ గోకారి సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. తాగి వాహనాలు నడిపితే డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఖయ్యూం, వేణు, రవి, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

సీబీఐకి అప్పగించాలని ర్యాలీ

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీలో జరిగిన రూ.కోటి నిధుల అవినీతికి సంబంధించిన కేసును సీబీఐకి అప్పగించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంతటి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అవినీతిపై ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. డబ్బును పూర్తిగా రికవరీ చేయకపోతే దశలవారిగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్, అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, పృథ్విరాజ్, కల్యాణ్, ఎం నాగేష్, పరశురాం, భాస్కర్, లక్ష్మణ్, బాల్‌నాగయ్య, గణేష్, రావన్, వెంకటేష్, సాయిబాబ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 7 వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం పే స్కేలును అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, శివయ్య, స్వామి, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మంత్రి జూపల్లి కృష్ణారావు స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.23.25 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంజూరు పత్రాలను సోమవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంత్రి క్యాంపు కార్యాలయ అధికారులు అందజేశారు. పట్టణంలోని గాంధీ హైస్కూల్‌కు రూ.13.75 లక్షలు, బాలికల ఉన్నత పాఠశాలకు రూ.6లక్షలు, ఆర్‌ఐడీ పాఠశాలకు రూ.5.50 లక్షలు మంజూరయ్యారు. అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక న్యాయం కోసమే మాదిగల పోరాటం

నాగర్‌కర్నూల్‌రూరల్: సామాజిక న్యాయం కోసమే మాదిగల పోరాటం అని ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మంద జీవేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన దేవరపాగ ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి యాదయ్య, విజయ్‌కుమార్, బోరెల్లి కొండయ్య, సుదర్శన్, బాలస్వామి, కురుమూర్తి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను విమర్శించడం తగదు

అచ్చంపేట రూరల్: మందకృష్ణ మాదిగను విమర్శించడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సమన్వయ కర్త మాచారం వెంకటేష్ అన్నారు. సోమవారం అచ్చంపేటలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. అందరికి రాజ్యాంగ ఫలాలు అందాలన్నదే మందకృష్ణమాదిగ సిద్ధాంతమన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రమేష్, బాల్‌రాజు, కొండల్, రాజు, అనీల్ పాల్గొన్నారు.

మాదిగలను విస్మరించడం తగదు

కొల్లాపూర్: రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కారు మాదిగలను విస్మరిస్తోందని తెలంగాణ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. నెలలు గడుస్తున్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదన్నారు. వెంకటస్వామి, శ్రీనివాసులు, కురుమయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కల్వకుర్తిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు



అమ్రాబాద్‌లో..

సాక్షి, నెట్‌వర్క్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లోని తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. వచ్చే నెల 22వ తేదీవరకు సమస్యలను పరిష్కరించకపోతే 23 నుంచి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీంకు, బిజినేపల్లి తహసీల్దార్ శ్రీరాములుకు, లింగాల తహసీల్దార్ పాండుకు పలు సమస్యలను విన్నవించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, కార్యదర్శి జయపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, భాస్కర్‌గౌడ్, ప్రవీణ్, జగదీష్, చెన్నయ్య, చంద్రశేఖర్, రామారావు, శివప్రసాద్, రామకృష్ణ, విష్ణుమూర్తి, ఆనంద్, భాగ్యలక్ష్మి, రాధారాజు, సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, శ్రీనివాసులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



అమ్రాబాద్: మండలంలోని అమరేశ్వరాలయంలో కొన్ని సంవత్సరాలుగా పురోహితుడిగా సేవలు అందిస్తున్న శ్రీకుమార్‌కు హైదరాబాద్ నాటకరంగస్థలం ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉత్తమ పురోహిత నంది అవార్డును అందజేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక అమరేశ్వరాలయంలో పూజారి శ్రీకుమార్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. బాలకార్మిక నిర్మూలనకు కృషి చేస్తున్న శ్రీకుమార్‌కు అవార్డు దక్కడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టినాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



చారకొండ: ప్రతి గింజను కొనుగోలు చేస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ ఆధ్వర్యంలో సింగిల్‌విండో కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రంతో పాటు నూతనంగా రూ.38 లక్షల వ్యయంతో నిర్మించిన గోదాంను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, డీసీసీబీ డైరెక్టర్లు వెంకటేష్, తిరుమల్ రెడ్డి, నాయకులు వెంకట్‌గౌడ్, వెంకటయ్య యాదవ్, బాల్‌రాం గౌడ్, డైరెక్టర్లు, బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో పశువులకు సోమవారం పశువైద్యాధికారులు మౌనిక, యాదగిరిలు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గ్రామంలో ఇంకా రెండు రోజుల పాటు టీకాలు వేస్తామని వారు పేర్కొన్నారు. గోపాలమిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి



తాడూరు: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం పర్వత్‌రెడ్డి, సదనందంగౌడ్‌లు సోమవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ పార్లమెంట్ సెషన్‌లో సవరణ ఉత్తర్వుల కొరకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి హాజీపూర్ చౌరస్తాలో ఉన్న బటర్‌ఫ్లయ్ హోటల్ నిర్వాహకులు రమేష్, గణేష్ సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డికి రూ.25వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పలకపల్లి పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు

అచ్చంపేట: మండలంలోని పలకపల్లి గ్రామ పంచాయతీలో సుమారుగా రూ.16 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్‌కు గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బాధ్యులైన కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి అక్టోబరు 31 వరకు అప్పటి కార్యదర్శి గడ్డం విజయ్‌కుమార్ ఎలాంటి పనులు చేయకుండా, చేసిన పనులకు ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యదర్శి బదిలీ తర్వాత బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి లక్ష్మి 2023 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు, టీఎస్ బీపాస్, జీపీ అకౌంట్ల నుంచి సుమారుగా రూ.6లక్షల నిధులు డ్రాచేసి దుర్వినియోగంకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వీధిదీపాలు, తాగునీటి పైపులైన్ నిధుల డ్రాకు సంబంధించిన కాపీలను కలెక్టర్ ఫిర్యాదులో పేర్కొంటు జత చేసి అందజేశారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.